గల్పిక

# చలిరాబండలు

మా. త. శాస్త్రి

కార్మిక నాయకుల ఆదేశానుసారం కార్మిక, కర్షక, శ్రామికసంఘాలలో దుమికి కార్యకలాపాలు చేశాను. అబ్బే ..రుచించలేదు. వీళ్ళ తలకాయలు చలిరాబండలు! ఉపదేశాలు కాదు కదా గునపాలయినా దిగవు ఈ తలకాయల్లోకి! మా నాయకులకు మనవిచేసుకున్నాను. ఈ వ్యవసాయక్షేత్రం నుండి విజ్ఞాన క్షేత్రానికి నన్ను ఎగుమతి చేయమని కోరాను. నాకోరిక మన్నించబడింది. వైజ్ఞానిక రంగానికి ఎగుమతయాను.

ప్రసాదరావుగారిని కలుసుకొని సంతోషించాను. ఆముదపుమిల్లు కార్మికులూ, పీచుకూలీలూ, పంచాయితీ పనివారూ, మత్స్యపారిశ్రామికులూ, పొగాకు శ్రామికులూ నన్ను విడనాడినందుకూ, నన్ను వాళ్ళనుండి విడుదల చేసినందుకూ, దానవులకూ, మానవులకూ, కోటానుకోట్ల నమస్కారజలపాతాలను అర్పించాను. నాకు ప్రసాదరావుగారి ఉనికి పరమ ప్రసాదంగా అనిపించింది. మొత్తానికి నా మట్టుకు సోషలిజం ప్రాప్తించినట్లే!

ప్రసాదరావుగారు ఎమ్. ఎస్. సి. పుచ్చుకున్నారు. డి. యస్. సి. కొరకు అష్టసముద్రాలు పరిశోధిస్తున్నారు. ఒకరోజు సాయంకాలం సముద్రపుటొడ్డున కూర్చున్నాం. ప్రకృతిని గురించీ మానవుణ్ణిగురించీ, మనస్సును గురించీ తత్వజ్ఞాన విషయాలను చర్చిస్తున్నాం. హఠాత్తుగా రంగనాయకులు మావద్దకువచ్చి, ఒక పిడుగులాంటి వార్త తెచ్చాడు. మాతో చిరకాలంనుండీ పని చేస్తున్న వాళ్ళలో ముఖ్యులు ఇద్దరు. ఒహటి రంగనాయకులు. రెండు పేర్రాజు. ఇప్పుడు రంగనాయకులు తెచ్చినవార్త పేర్రాజు గురించి. మా ప్రసాదరావు తాబేలులాగ మెడచాచి అడిగాడు. 'ఏమిటా వార్త?' రంగనాయకులు ఒగర్చుకుంటూ చెప్పాడు. 'ఇవ్వాళ్టిప్రొద్దుట మీటింగులో పేర్రాజు తేల్చేశాడు. మన నాయకత్వంలో నమ్మకం లేదన్నాడు. మన నాయకత్వంలో నిరంకుశత్వం ప్రబలిందన్నాడు. నిరశనగా మన పార్టీనుండి విడిపోతున్నానన్నాడు. తన సిద్ధాంతాలను ప్రచారం చేసుకోవడం కోసం ఒక వారపత్రిక పెట్టబోతున్నానన్నాడు...' ఇంకా రంగనాయకులు గుడ్లు మిటకరిస్తూ రొప్పుతూ చెపుతూనే ఉన్నాడు. హఠాత్తుగా ప్రసాదరావు నిలబడి ఉపన్యాస ధోరణిలో "...తెలిసిపోయింది. పేర్రాజుని కార్మిక నాయకుణ్ణిగా మనం చేశాం. అతన్ని పీడిత ప్రజలపాలిటి వేగుచుక్కగా మనం పెంపొందించాం. ఇప్పుడువాడు బూర్జువాల ఏజంటని తేలిపోయింది. ఇప్పుడు వాడు పెట్టుబడిదారుల తొత్తు అని అర్థమయింది. వాడికి డల్లెస్‌డబ్బు వచ్చివుండాలి. వాడు అమ్ముడుపోయాడు.."

నేను ఆశ్చర్యపోయాను. పేర్రాజు పార్టీ జీవితం ఇరవై రెండేళ్ళు మా ప్రసాదరావు పార్టీ జీవితం రెండేళ్లు నిండలేదు. అసలు ప్రసాదరావు పూర్తి జీవితం పేర్రాజుయొక్క పార్టీ జీవితమంత లేదు. ప్రసాదరావు పేర్రాజుని నాయకుడుగా పెంపొందించడ మేమిటీ, అసలు డల్లెస్ ఏమిటీ, డబ్బు పంపడ మేమిటీ?

"ప్రసాదరావుగారూ, అతనికి మనతో అభిప్రాయభేదాలు ఉండే సర్వహక్కులూ ఉన్నాయి కదా! అతనికి అభిప్రాయాలలోనూ, అభిమతాల లోనూ, ఆచరణలోనూ తనకు సొంత అభిప్రాయాలు ఉండే హక్కు ఉన్నది అందుకు అతన్ని మనం ఇంత గాఢంగా ద్వేషించనవసరంలేదేమో!.." అంటూండగానే హఠాత్తుగా ప్రసాదరావు కదలి "శత్రువుని ద్వేషించమన్నాడు లెనిన్. శత్రువునీ శత్రువర్గాన్నీ, శత్రు కుటుంబాన్నీ, శత్రు బంధుమిత్రులనూ కూడా ద్వేషించడం మనం నేర్చుకోవాలి"అని అంటూ నా భుజాలమీంచి దాటుకుంటూ పెద్దపెద్ద అంగలువేసుకొంటూ వెళ్ళిపోయాడు. సముద్రపు ఒడ్డుదాటి రోడ్డెక్కి నడకవేగం హెచ్చించాడు.

★